క్లుప్తంగా

యోగభోగేశ్వరుడికి రుద్రాభిషేకం


ప్రత్యేక అలంకరణలో యోగభోగేశ్వరుడు

మదనపల్లె సిటీ: స్థానిక బెంగళూరురోడ్డులోని శ్రీయోగభోగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామికి రుద్రాభిషేకం చేశారు. స్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమణ, అర్చకులు విశ్వేశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుడు మృతి


పాపన్న (ఫైల్)

బి.కొత్తకోట: పారిశుద్ధ్య కార్మికుడిగా 40 ఏళ్లుగా సేవలు అందించిన బి.కొత్తకోటకు చెందిన ఆవుల పాపన్న (62) సోమవారం మృతి చెందాడు. ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో వైద్యం కోసం కుటుంబీకులు బెంగళూరుకు తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. బి.కొత్తకోట మేజర్ పంచాయతీలో 36 ఏళ్లు పనిచేశారు. తర్వాత కొంతకాలం హార్సిలీహిల్స్‌పై విధులు నిర్వహించి ప్రస్తుతం గుర్రంకొండ పంచాయతీలో పని చేస్తూ మృతి చెందాడు. వచ్చేనెల 31న పాపన్న ఉద్యోగ విరమణ చేయాల్సి వుంది. పాపన్న మృతదేహానికి కమిషనర్ పల్లవి, అకౌంటెంట్ రమాదేవి, నగర పంచాయతీ ఉద్యోగులు, మాజీ సర్పంచులు ఇసరయ్యగారి నాగరాజు, కుడుం శ్రీనివాసులు, గుర్రంకొండ కార్యదర్శి హరి, పట్టణ అధ్యక్షులు బంగారు వెంకటరమణ తదితరులు నివాళులర్పించి కుటుంబీకులకు సంతాపం తెలిపారు.

గజ వాహనంపై ఏనుగుమల్లమ్మ


విశేషాలంకరణలో ఏనుగుమల్లమ్మ

బి.కొత్తకోట: మండలంలోని హార్సిలీహిల్స్‌పై వెలసిన ఏనుగు మల్లమ్మ ఉత్సవాల్లో భాగంగా సోమవారం రెండోరోజూ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఉదయం విశేష అభిషేకాలు, అర్చనలు, మహా మంగళహారతి కార్యక్రమాలకు భక్తులు, స్థానికులు హాజరయ్యారు. ఏనుగుమల్లమ్మకు ప్రత్యేక అలంకరణలు చేయగా ప్రజలు జరిపి మొక్కులు తీర్చుకున్నారు. వీరికి తీర్థప్రసాదాలను అందించారు. సాయంత్రం ఏనుగుమల్లమ్మ ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో కొలువుదీర్చి గజ వాహనంపై ఊరేగించారు. కొండపై జరిగిన ఊరేగింపుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

సాకర్ టోర్నమెంటు విజేత డీఎఫ్ఏ జట్టు


ట్రోఫీతో విజేత డీఎఫ్ఏ జట్టు

మదనపల్లె సిటీ: స్థానిక సీఎస్ఐ మిషన్‌కాంపౌండ్‌లో ఆరాధన సాకర్ ఫుట్‌బాల్ టోర్నమెంటు నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగిన పోటీల్లో 12 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్స్‌లో బీఎస్‌సీ, డీఎఫ్ఏ జట్లు పోటీపడ్డాయి. బీఎస్‌సీ టీమ్‌కు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దిలీప్‌కుమార్ ప్రాతినిధ్యం వహించగా, డిఎఫ్ఏ టీమ్‌కు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి మురళీధర్ ప్రాతినిధ్యం వహించారు. హోరాహోరీగా జరిగిన పోటీలో డీఎఫ్ఏ జట్టు 3–4 గోల్స్‌తో బీఎస్‌సీ జట్టుపై విజయం సాధించింది. గెలుపొందిన విజేతను ట్రోఫీ,మెడల్స్,ప్రోత్సాహక నగదును అందజేశారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జాన్ కమలేష్, అభిలాష్, మహేంద్రనాయక్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రచయితకు సన్మానం

పుల్లంపేట : రచయిత శ్రీ రామదాసు పద్మనాభయ్యను సేవా సంస్థల అధినేత, అధ్యాపక బృందం, ప్రముఖులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. అనంతరం ఈయన రచించిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి అవతార మహిమ కాలజ్ఞానం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.

అవే సమస్యలు..అవే వినతులు


మదనపల్లె: అర్జీలు ఇచ్చేందుకు సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన ప్రజలు


అర్జీలు ఇచ్చేందుకు టోకెన్ల కోసం క్యూలో ప్రజలు

- పరిష్కారానికి నోచుకోక మళ్లీ మళ్లీ వస్తున్న ప్రజలు
- సమస్యలు తీర్చేదెప్పుడంటూ ఆవేదన

మదనపల్లె: కూటమి ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కోసం ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రతి అర్జీకి బాధ్యత తీసుకుంటుందని చెప్పడమే కాని చేతల్లో సాధ్యం కావడం లేదని సోమవారం మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన వినతులు స్పష్టంగా చెబుతున్నాయి. ఒకటికి నాలుగుదైసార్లు సబ్‌కలెక్టర్ కార్యాలయం గడప తొక్కుతున్నా సమస్యలు పరిష్కారం కాకపోతే తమ గోడు ఇంకెవరికి చెప్పుకోవాలి, ఎవరు పరిష్కరిస్తారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన అర్జీలను మళ్లీ మళ్లీ ఇస్తూ..ఇంకెన్నాళ్లు ఇలా కార్యాలయం చుట్టూ ప్రదిక్షణలు చేయాలంటూ దీనంగా ప్రశ్నిస్తున్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని మండలాల నుంచి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చారు. సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ అందుబాటులో లేకపోవడంతో కార్యాలయ పరిపాలనా అధికారి కేఆర్.రాఘవేంద్రరావు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఆయా సమస్యలపై స్పందించి పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు సూచించారు. మొత్తం 67 మంది నుంచి వివిధ సమస్యలపై వినతులు అందాయి. మదనపల్లె తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ధనంజయలు, మున్సిపల్ కార్యాలయంలో కమీషనర్ ప్రమీల ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

నాలుగు అర్జీలు ఇచ్చారు

నిమ్మనపల్లె మండలం చీకటిపల్లెకి చెందిన కే.చిన్న వెంకటరమణకు 77.50 సెంట్ల భూమి ఉండగా 58 సెంట్లు మాత్రమే ఉన్నట్టు రికార్డులో నమోదైంది. తనవద్ద ఉన్న అన్ని రికార్డులతో కార్యాలయానికి వచ్చిన వెంకటరమణ సరిచేయాలని విన్నవించాడు. ఈ సమస్యపై తొలిసారి 2024 ఫిబ్రవరి 12న విన్నవించాడు. తర్వాత 2025 ఫిబ్రవరి 17న విన్నవించగా 2024 అక్టోబర్ 30న జరిగిన రెవెన్యూ సదస్సులో అర్జీ ఇచ్చినా చర్యలు లేకపోవడంతో మళ్లీ ఇదే సమస్యపై అర్జీ ఇచ్చాడు.

అర్జీలపై అర్జీలు

బి.కొత్తకోట మండలం గోళ్లపల్లె గ్రామం దిన్నిమీద పల్లెకు చెందిన ఎస్.రామచంద్రారెడ్డి తన భాగస్వాముల వద్ద కొన్న భూమి, తనకు సంక్రమించిన భూమి కలిపి మూడెకరాలు ఉంది. ఇందులో ఒకటిన్నర ఎకరం భూమి ముగ్గురు వ్యక్తుల పేరిట నమోదు చేయడంతో ఒకటిన్నర ఎకరం పోలమే చూపుతోంది. దీనితో కూటమి ప్రభుత్వం వచ్చాక అర్జీలపై అర్జీలు ఇచ్చినా ఫలితం లేదు. 2024 ఆగష్టు 2న, 2025 ఫిబ్రవరి 3న అర్జీలు ఇచ్చాడు. మళ్లీ సోమవారం అర్జీ ఇచ్చాడు. అయినా ఇప్పటికి సమస్య పరిష్కారం కాలేదు.

నాలుగుసార్లు వినతి

కురబలకోట మండలం నందిరెడ్డిగారిపల్లెకు చెందిన కమాల్ సాహెబ్ తన తండ్రి ఖాదర్‌సాబ్ పేరిట మంజూరైన పట్టా భూమి తొమ్మిది సెంట్లను ఆక్రమించుకుంటున్నారని చర్యలు తీసుకుని న్యాయం చేయాలని పలుమార్లు వినతులు ఇచ్చినా అధికారుల్లో చలనం లేదు. 2004 మే 6న తొలిసారి విన్నవించగా కూటమి ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందని 2024 మే 9, జూలై 15, ఆగష్టు 5న ఫిర్యాదులు చేసుకున్నారు. సోమవారం మళ్లీ సబ్‌కలెక్టర్ కార్యాలయానికి రాగా సబ్‌కలెక్టర్ లేకపోవడంతో వెనుదిరిగి వెళ్లిపోయారు. ఈ సమస్య పరిష్కారానికి ఎన్నేళ్లు పడుతుందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

20 ఏళ్లుగా అర్జీలు

మదనపల్లె పట్టణం బీకేపల్లి గ్రామంలోని ప్రభుత్వ భూమిలో ఇళ్లు నిర్మించుకున్న తమకు పట్టాలు జారీ చేసి ఆదుకోవాలని 20 ఏళ్లుగా కోరుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. సర్వేనంబర్ 533/1సి, 533/2సి లో 126 మంది ఇళ్లు నిర్మించుకున్నారు. దీనిపై వీరికి పట్టాలు జారీ చేయబడలేదని తహసీల్దార్ ధనుంజయలు పేర్కొన్నారు. అయితే తమ సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

రేపు ప్రత్యేక విద్యుత్ అదాలత్

– ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ గంగాధరం

మదనపల్లె రూరల్ : ఆంధ్రప్రదేశ్ దక్షిణప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్), విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక మదనపల్లె డివిజన్ ఆధ్వర్యంలో మే 21 బుధవారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఈఈ గంగాధరం తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...బుధవారం ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సీటీఎంరోడ్డులోని డివిజన్ ఆఫీస్ కాంపౌండ్‌లో ప్రత్యేక విద్యుత్ అదాలత్ జరుగుతుందన్నారు. కార్యక్రమానికి రిటైర్డ్ జడ్జి వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి అధ్యక్షులుగా, ఆర్థిక సభ్యులు, కె.రామమోహన్‌రావు, సాంకేతిక సభ్యులు అంజనీకుమార్ స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మి ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు. మదనపల్లె ఆపరేషన్ డివిజన్ పరిధిలోని మదనపల్లె, రూరల్, ములకలచెరువు సబ్ డివిజన్ పరిధిలోని సెక్షన్లకు, మండలాలకు సంబంధించిన విద్యుత్ వినియోగదారులు ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లో పాల్గొని దీర్ఘకాలిక సమస్యలపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేసి సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. విద్యుత్ వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

ఐక్యంగా హనుమాన్ శోభాయాత్ర

మదనపల్లె: ఈనెల 22న హనుమాన్ జయంతి శోభా యాత్రను ఐక్యంగా జరుపుకుందామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పిలుపునిచ్చారు. సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం జరిగిన శోభా యాత్ర ఘటనను ప్రస్తావిస్తూ తిరిగి చేపట్టిన శోభా యాత్రకు సహకరించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. యాత్రకు ఎస్పీ నుంచి అనుమతులు ఇప్పించి కార్యక్రమం విజయవంతం చేసేందుకు బాధ్యతగా సహకరిస్తామని చెప్పారు.

ప్రజల మనిషి పుచ్చలపల్లి సుందరయ్య

సీపీఎం జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాసులు


సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

మదనపల్లె రూరల్ : అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం భూస్వామ్య వ్యవస్థలను బద్దలు కొట్టి పేద ప్రజలకు భూములు పంచిపెట్టిన గొప్ప వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. సోమవారం సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో ప్రధాన భూమిక పోషించిన సుందరయ్య తన జీవితాన్ని ప్రజలకు అంకితమిచ్చిన గొప్ప నాయకుడన్నారు. బడుగు, బలహీనవర్గాలతో పాటు కార్మిక, కర్షకుల కోసం అనునిత్యం పోరాడిన విప్లవ కమ్యూనిస్టు యోధుడు అన్నారు. పార్లమెంటు, అసెంబ్లీలో ప్రజాసమస్యలపై, ఆనాటి ప్రభుత్వాలపై గళమెత్తి అనేక అంశాలపై రాజకీయ ప్రత్యర్థులు సైతం ప్రశంసించే విధంగా ప్రజల మన్ననలు పొందిన గొప్ప పార్లమెంటేరియన్ సుందరయ్య అన్నారు. వ్యవసాయ కార్మికసంఘాన్ని స్థాపించి తనకున్న వందల ఎకరాల భూములను పేదలకు పంచిపెట్టిన గొప్ప త్యాగశీలి సుందరయ్య అని కొనియాడారు. సుందరయ్య భౌతికంగా దూరమై 40 ఏళ్లయినా వారి స్ఫూర్తి ఎప్పటికీ మనతోనే ఉంటుందని, వారి ఆశయాలకు అంకితమై పనిచేయడమే వారికి మనమిచ్చే ఘనమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో నాయకులు నరసింహ, అశోక్, ప్రసన్న, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు సత్వర న్యాయం జరిగేలా చూడండి


ఎస్పీకి అబేద్కర్ చిత్రపటం అందజేస్తున్న పాలకుంట శ్రీనివాసులు, రామకృష్ణ

కలకడ: జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడుల్లో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడును జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, సత్యాల రామకృష్ణలు కోరారు. సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీని కలసి సత్కరించారు. డాక్టర్ అంబేద్కర్‌చిత్రపటాన్ని అందజేసి సమస్యలను తెలియజేశారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో విచారణ వేగవంతం చేయాలని, అలసత్వం లేకుండా అట్రాసిటి కేసుల్లో చార్జ్‌షీట్ నిర్ణీత కాలవ్యవధిలో దాఖలు చేయాలని కోరినట్లు తెలిపారు.

మాకం అశోక్ మృతి తీరని లోటు


నివాళులు అర్పిస్తున్న నిస్సార్‌అహ్మద్

మదనపల్లె సిటీ: ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు, వాసవీ ట్రస్టు వ్యవస్థాపకులు మాకం అశోక్‌కుమార్ మృతి తీరని లోటని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్ అన్నారు. సోమవారం స్థానిక నెహ్రూబజార్‌లో అశోక్‌కుమార్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆర్యవైశ్య సంఘంలో పలు సామాజిక కార్యక్రమాలు చేపట్టారన్నారు. దేవాలయాల నిర్మాణం, పేదవారిని ఆదుకున్నారన్నారు. వాసవీ ట్రస్టు ద్వారా హిందూశ్మశాన వాటిక అభివృద్ధికి తన వంతు కృషి చేశారన్నారు. అశోక్‌కుమార్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. నివాళులు అర్పించిన వారిలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి , మున్సిపల్ చైర్మన్ మనూజరెడ్డి, వైఎస్సార్‌సీపీ వాణిజ్యవిభాగం రాష్ట్ర కార్యదర్శి గార్ల చంద్రమౌళి,బింగి పాండు,జయకుమార్, నాయకులు మహేష్,యూనస్, సాదిక్, అబ్దుల్లా, ఆర్యవైశ్య సంఘ నాయకులు కిషోర్,మధు తదితరులు ఉన్నారు.

వైభవంగా గర్నిమిట్ట ఎల్లమ్మ జాతర

ఆకట్టుకున్న చాందినీబండ్లు


ఆలయ ప్రదక్షిణలు చేస్తున్న చాందినీబండ్లు

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్టలో వెలసిన శ్రీ ఎల్లమ్మతల్లి జాతర అంగరంగవైభవంగా జరిగింది. జాతరలో భాగంగా గత మూడు రోజులుగా అమ్మవారి ఆలయంలో వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం రాత్రి నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి అమ్మ వారికి మొక్కుబడులు చెల్లించారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి మహిళా భక్తులు బోనాలు తీసుకువచ్చారు. అమ్మవారికి బోనాలు, చీరలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే మండలం నుంచే గాక వివిధ ప్రాంతాల నుంచి భక్తులు చాందినీబండ్లు కట్టి మొక్కుబడులు చెల్లించారు. చాందినీ బండ్లు ముందు బళ్లారి డ్రమ్స్, చెక్కభజనలు, కోలాటాలు, పిల్లనగ్రోవి తదితర కళారూపాలు ఆకట్టుకున్నాయి. సోమవారం ఉదయం చాందినీబండ్లు అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. చాందినీ బండ్లకు మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాలంకరణలు ఆకట్టుకున్నాయి. ప్రతి చాందినీ బండి ముందు పెద్ద ఎత్తున బాణా సంచా పేలుళ్లు మార్మోగాయి. జాతరలో భాగంగా అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు ఎల్లమ్మ అమ్మవారిని దర్శించి తరించారు. ఆలయం ముందు పెద్ద ఎత్తును కొబ్బరి కాయలు కొట్టి సంవృద్ధిగా వర్షాలు కురవాలని, పాడిపంటలు అభివృద్ధి చెందేలా ప్రజలను చల్లగా చూడాలని వేడుకొన్నారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది.

సైనికుల త్యాగాలకు వందనం


తిరంగ విజయోత్సవ ర్యాలీ

పెద్దతిప్పసముద్రం: దేశం కోసం త్యాగాలు చేస్తున్న సైనికులకు వందనం...వారికి మనమంతా బాసటగా నిలుద్దాం అంటూ మండల కేంద్రంలో ప్రజలంతా నినాదాలు చేశారు. మండల కేంద్రంలో సోమవారం కూటమి నాయకులు జాతీయ జెండాలను చేతబట్టి తిరంగ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పాకిస్తాన్‌లోని ఉగ్ర స్థావరాల ధ్వంసమే లక్ష్యంగా భారత త్రివిధ దళాలు చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడంతో సైనికులకు సంఘీభావంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. కూటమి నాయకులు శ్రీకాంత్, మల్లెం శివయ్య, కార్యం శంకర్, రియాసత్ అలీఖాన్, సిమెంట్ శీనా, కిరణ్, వెంకట్రమణ, సికిందర్, కిట్టన్న, చిన్నా, రామాంజులు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

జూన్ 5న ఏపీజీఈఏ రాష్ట్ర మూడో మహాసభ


ఏపీజీఈఏ మహాసభ పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు

మదనపల్లె రూరల్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ) రాష్ట్ర మూడో మహాసభ జూన్ 5న విజయవాడలో నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి గురుప్రసాద్, తాలూకా అధ్యక్షులు నాగేంద్రబాబు తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో రాష్ట్ర మూడో మహాసభకు సంబంధించి వాల్‌పోస్టర్స్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...విజయవాడలో జూన్ 5న జరిగే సమావేశానికి జిల్లా నుంచి అధికసంఖ్యలో ఉద్యోగులు హాజరయ్యేలా చూడాలన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఏపీజీఈఏ పనిచేస్తుందన్నారు. ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఏపీజీఈఏ మదనపల్లె తాలూకా కార్యదర్శి శివరాంప్రసాద్, ట్రెజరర్ ఉమాశంకర్, చలపతి, ధర్మయ్య, వరలక్ష్మి, కిరణ్, గిరి, సరస్వతి, రెడ్డెప్ప, హరి పాల్గొన్నారు.

ఆదిత్య ఇంజినీరింగ్ విద్యార్థులకు గోల్డ్ మెడల్స్


గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకుంటున్న సాజిదామురాద్, రమ్యశ్రీ (ఫైల్)

మదనపల్లె సిటీ: అనంతపురం జేఎన్‌టీయూలో ఇటీవల నిర్వహించిన స్నాతకోత్సంలో స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు రమ్యలక్ష్మి, సాజిద్‌మురాద్‌లు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్స్ అందుకున్నట్లు కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి, ప్రిన్సిపాల్ సతీష్ సోమవారం తెలిపారు. 2020–24 బ్యాచ్‌కు చెందిన కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంకు చెందిన ఎం.రమ్యశ్రీ, సివిల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఎస్.సాజిదామురాద్‌లు అకడమిక్‌లో అత్యధిక శాతం మార్కులు సాధించారు. దీంతో యూనివర్సిటీ వీరిద్దరికి గోల్డ్ మెడల్స్ ప్రకటించింది. గోల్డ్ మెడల్స్ అందుకున్న విద్యార్థులను కాలేజీ డైరెక్టర్, ప్రిన్సిపాల్, విభాగాధిపతులు అభినందించారు.

పల్లకిలో భద్రకాళీ సమేతుడు

రాయచోటి టౌన్ : వీరభద్రస్వామి పల్లకిలో ఊరేగారు.సోమవారం రాత్రి స్వామి, అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించిన ఆలయ ప్రధాన అర్చకులు అందంగా అలంకరించి పల్లకిలో ఉంచి ఊరేగించారు. పల్లకీలో సేవలో స్థానిక భక్తులతో పాటు కన్నడ భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

మండలానికి 8 కొత్త బోర్లు మంజూరు

ఎంపీడీఓ పరమేశ్వర్ రెడ్డి


కత్తిరివారిపల్లెలో నూతన తాగునీటి బోరు వేయిస్తున్న అధికారులు

మ్మనపల్లె : మండలంలో తాగునీటి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఎనిమిది కొత్త బోర్లు మంజూరు చేసిందని ఎంపీడీఓ పరమేశ్వర్ రెడ్డి, తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మిథున్ చక్రవర్తితో కలిసి మాట్లాడారు. మండలంలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలను గుర్తించి నూతన బోర్లు వేయడానికి నివేదికలను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపడం జరిగిందన్నారు. దీంతో జిల్లా ఉన్నతాధికారులు జిల్లా ప్రజా పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా మండలానికి రూ.20 లక్షలతో 8 తాగునీటి నూతన బోర్లను మంజూరు చేశారన్నారు. ఈ నిధులతో వెంగంవారిపల్లి పంచాయితీ కత్తిరివారిపల్లె, కొండయ్యగారిపల్లి పంచాయతీ అంబేద్కర్ కాలనీ, రాచవేటివారిపల్లి పంచాయితీ ఎగువమాచిరెడ్డిగారి పల్లి, రాచవేటివారి పల్లి, ఆచార్లపల్లె, తవళం పంచాయతీ చౌకిల్లవారిపల్లె, తవళం , ముష్టూరు పంచాయితీ చల్లావారిపల్లెలలో నూతన తాగునీటి బోర్లను డ్రిల్ చేయనున్నట్లు తెలిపారు. నూతన బోర్లతో స్థానిక ప్రజల తాగునీటి సమస్యలకు పరిష్కారం లభిస్తుంది అన్నారు.

అన్నదాతకు అపార నష్టం


గాలి తాకిడికి విరిగిపోయిన అరటితోటను చూపుతున్న రైతు రెడ్డప్పరెడ్డి


నేలవాలిన మొక్కజొన్న పంట

తంబళ్లపల్లె: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న గాలి, వానలతో అన్నదాతకు అపార నష్టం వాటిల్లింది. ఆదివారం సాయంత్రం గాలి,వాన బీభత్సవం సృష్టించింది. తంబళ్లపల్లెకు చెందిన రెడ్డప్పరెడ్డి, లోకేశ్వరరెడ్డి, రాజారెడ్డిలు కలిసి రెండు ఎకరాల్లో అరటి తోట సాగుచేశారు. అరటిగెలలు కోతకు వచ్చే సమయంలో విపరీతమైన గాలి తాకిడికి తోట నేలమట్టమైంది. దీంతో సుమారు రూ.2లక్షలు నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మరో రైతు రామచంద్ర రెండు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. కోతకు వచ్చే సమయంలో గాలి,వానతో మొక్కజొన్న పంట పూర్తిగా నేలవాలి నష్టవాటిల్లినట్లు వాపోయారు. ప్రభుత్వం స్పందించి పంటనష్టం పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు.

ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై అవగాహన


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఏపీఎం రెడ్డెమ్మ

చిన్నమండెం : ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై రైతులకు అవగాహన కల్పించినట్లు ఏపీఎం రెడ్డమ్మ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామ సంఘం–2లో రైతులకు గ్రామసభ నిర్వహించారు. గ్రామంలోని చౌడుకుంట వీధిలో ర్యాలీ నిర్వహించి ఆదర్శ రైతుల విజయగాథలపై అవగాహన కల్పించారు. పీఎండీఎస్ వేయడం వలన లాభాలు, ప్రయోజనాల గురించి విపులంగా వివరించి, పాంప్లెట్స్ పంచి గోడపత్రాలను అంటించారు.